అలాగే ఓ పుట్టినరోజు నించి ఇంకో పుట్టినరోజు దాకా జరిగిందంతా లాభం కిందే లెక్క. మీరే చెప్పండి. 365 రోజులు బ్రతకడం లాభం కాక నష్టమా?

# కమ్మని కల

మే ఇరవై అయిదున నేను మా ఇంటికి ఎక్స్‌టెన్షన్‌గా ఓ గది కట్టించాలని వాటికి సంబంధించిన పేపర్లతో మునిసిపల్ కార్పొరేషన్‌కి వెళ్ళాను. అక్కడ లంచం ముట్టనిదే ఏ పనీ జరగదని ఎల్. కె. జి. కుర్రాడికి కూడా తెలిసిందే.

ఓ ఆఫీసర్‌కి ఆ పేపర్లు సబ్‌మిట్ చేశాను. ఆయన దాన్ని జాగ్రత్తగా పరిశీలించి, అంతా నియమాల ప్రకారమే వుందని రూఢి చేసుకున్నాక సేంక్షన్ సంతకం చేసేసాడు. లంచం గురించి మాట్లాడకుండా ఆయనలా సంతకం చేయడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయనంతట ఆయన అడిగితే బావుండదని, భేషజానికి పోయాడనుకుని చెప్పాను మెల్లిగా.

"వెయ్యి రూపాయలు తెచ్చాను సార్."

"దేనికి?" అడిగాడాయన.

"మీకివ్వాలని."

"నాకెందుకివ్వాలి?" నావంక ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

అది నాకు ప్రపంచంలో ఎనిమిదో వింతగా తోచడంతో చెప్పాను నీళ్ళు నములకుండా.

"సేంక్షన్‌కి పోయినసారి వెయ్యి తీసుకున్నారు కదా? అందుకని".

"ఆ రోజులు పోయాయి" చెప్పాడాయన నావంక ఎగాదిగా చూసి.

"వెయ్యి చాలదా?" అడిగాను.

"మీరు లంచం గురించి మాట్లాడేటట్లయితే బయటకి నడవండి.

ప్రభుత్వం నాకు జీతం ఇస్తోంది. జీతం తీసుకుంటున్నందుకు పనిచేసాను, నా పనిని నేను చేయడానికి మీరు లంచం ఎందుకివ్వాలి?" అడిగాడాయన నన్ను కోపంగా.

"మీకు లంచం ఇస్తే కాని సంతకం చేయనంటే నా పని ఆగి పోతుంది కాబట్టి. నా బలహీనతని మీరు మీ కేష్ చేసుకోవడం అధికారం ద్వారా ఆనవాయితిగా వస్తోంది కాబట్టి."

ఆయన చిద్విలాసంగా నవ్వి చెప్పాడు.

"చూడబ్బాయ్. నీ పేరేమిటో కానీ, మేం గతంలో తీసుకున్న లంచం పూర్తిగా మాకు చెందేది కాదు. నేను నా పై ఆఫీసర్‌కి, ఆయన ఇంకా పై ఆఫీసర్‌కి.... ఇలా ఒకరి నించి మరొకరికి అంచెలంచెలుగా అది మునిసిపల్ శాఖా మంత్రికి, ఆయన నించి ముఖ్యమంత్రికి వెళ్ళేది. వాళ్ళు కొన్ని ఏళ్ళుగా యిలా పోగేసుకున్న సొమ్ముని ఏం చేయాలో తెలియక సతమతమవుతుంటే యింకా కొత్త డబ్బుని ఏం చేసుకుంటారు?" అడిగాడాయన.

"ఏమయినా చేసుకుంటారు. డబ్బేం చేదు కాదు కదా?"

"ఒక్కొక్కరూ దాదాపు నాలుగు వందల కోట్ల రూపాయలకి తక్కువ కాకుండా సంపాదించారు. ఆ డబ్బు స్విస్ బేంకుల్లో వేసుకున్నారు. ఇప్పుడు సెప్టెంబర్ ముప్పైలోగా దాన్ని తిరిగి తీసుకుంటున్నారు. అంత డబ్బు ఎలా దాచడం, ఎక్కడ దాచడం?"

"స్విస్ బేంకుల్లోనే వుంచచ్చుగా?" అడిగాను.

"అయితే మీకు పేపర్ చూసే అలవాటు లేదన్నమాట?"

"లేదు".

"అయితే నిన్నటి పేపర్ చూడండి? రోజూ పేపర్ చదవాలి. స్విస్ బేంకులు ఓ చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నాయని పేపర్లో వార్త వచ్చింది.

"నాకు తెలీదే? దానికి, భారత దేశంలో లంచాలు తగ్గడానికి సంబంధం ఏమిటి?" అడిగాను.

"స్విట్జర్లాండ్‌లోని ఫెడరల్ బేంకింగ్ కమిషన్ ఓ నిర్ణయం

తీసుకుంది. జులై ఒకటి నించి స్విస్ బేంకులు అకౌంట్ హోల్డర్ పేరు చెప్పకపోతే వాళ్ళ డబ్బుని తమ బేంకుల్లో నిలవ చేసుకోవడానికి వప్పుకోవు. ఇంతదాకా అకౌంట్ హోల్డర్స్ తరఫున వాళ్ళ లాయర్లు, నంబర్ల అకౌంట్స్‌తో డబ్బు డిపాజిట్ చేస్తున్నారు. వాళ్ళంతా తమ పేర్లని సెప్టెంబర్ 30 లోగా వెల్లడించాలి. లేదా అకౌంట్స్ మూసేయాలి".

"ఇందాకటి నా ప్రశ్నకి మీరు సమాధానం చెప్పనేలేదు. దానికి, మన దేశంలో లంచాలు తగ్గడానికి గల సంబంధం ఏమిటి?" అడిగాను.

"చాలా వుంది. నన్నడిగితే అసలు వున్న కిటుకంతా అక్కడే వుంది. వివిధ దేశాల్లోని నియంతలు, రాజకీయ నాయకులు, డ్రగ్స్ వ్యాపారస్థులు, గూఢచారులు ఇంతదాకా స్విట్జర్లాండ్‌లో అలాంటి నంబర్డ్ అకౌంట్స్‌లో డబ్బు దాచుకుంటున్నారు. వాళ్ళ పేర్లు బయటకి వస్తే అన్ని కోట్ల డాలర్లు ఎలా సంపాదించారన్న అనుమానం ప్రజలకి, ప్రభుత్వానికి వస్తుంది. 'ప్రజలనించి తీసుకున్న లంచాలవల్ల' అన్న నిజాన్ని చెప్పలేరుగా. అంచేత ఇక అక్కడ డబ్బు వుంచితే ప్రమాదం కాబట్టి ఆ అకౌంట్లలోని మొత్తాలని మన నాయకులు తీసేస్తున్నారు."

"ఇంకో దేశంలోని బేంక్ అకౌంట్లలో వేసుకోవచ్చుగా?"

"ఒక్క స్విట్జర్లేండ్‌లోని బేంకుల్లో తప్ప ఇంకే దేశంలోని బేంకులు రహస్య ఖాతాలని అనుమతించవు."

"మన దేశంలో కొన్ని వేల బేంకుల బ్రాంచీలున్నాయి కదా. మరి ఒకో దాంట్లో పదివేల చొప్పున వేసుకుంటే?"

"దేశం మొత్తం తిరిగి అన్ని బ్రాంచిల్లో ఇలా డబ్బు డిపాజిట్ చేసుకుంటూ పోతూంటే బయటకి ఆ సంగతి పొక్కకుండా మానదు."

"పోనీ యింట్లో బీరువాల్లో దాచుకోవచ్చుగా?".

"ఏ నక్సలైటో బాంబువేస్తే మొత్తం తగలడిపోదూ? అంత డబ్బు ఇంట్లో వుందని తెలిస్తే బందిపోటు దొంగల ముఠాలు సంఘాలుగా ఏర్పడి శివార్లలో బదులు సరాసరి రాజకీయ నాయకుల ఇళ్ళలోనే పడి ఒబ్బురబద్దలు కొట్టి దోచుకుపోరూ? లేదా ఏ బావమ్మరిదో, కారు డ్రయివరో డబ్బుతో హుష్‌కాకి అంటే?".

"స్థలాలు, ఇళ్లు కొన్నా సోర్స్ చెప్పాలి. గట్టి చిక్కే" చెప్పాను.

"అవును. అంచేత వున్న డబ్బుని చక్కబెట్టుకోలేనప్పుడు కొత్తగా లంచాలు తీసుకొని ఇంకా బాధలు పెంచుకోలేరుగా. అంచేత లంచాలు తీసుకోవడం మానేయమని మా అందరికీ స్ట్రిక్ట్‌గా ఆర్డర్స్ వచ్చాయి."

ఒక్క మునిసిపల్ శాఖామాత్యులేనా లేక మిగతా మంత్రులంతా కళ్ళు తెరిచారో లేదో చూద్దామని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకి, కస్టమ్స్ ఆఫీసుకి, ఇంకా అన్ని రాష్ట్ర ప్రభుత్వ లంచాలు తీసుకునే ఆఫీసు లన్నిటికీ వెళ్ళాను. ఎక్కడా పైసా కూడా లంచం తీసుకోకుండా నా పనులన్నీ టకటక అయిపోయాయి.

తుంటిమీద కొడితే పన్ను రాలినట్లు ఎక్కడో అయిదున్నర వేల మైళ్ళ దూరంలో మన దేశంలో పాతికో వంతు కూడా లేని ఓ చిన్న దేశం తాలూకు బేంక్ తమ నియమాల్లో చేసిన చిన్న మార్పుకి ఒక్కసారిగా మన దేశ ప్రజల పరిస్థితి బాగుపడడం తలచుకుంటే ఈ ప్రపంచం ఎంతో చిన్నది అనిపించి....

"పేపర్ చదువుతూ నిద్రపోతావేమిటి? అన్నానికి లే" అన్న మా అమ్మ మాటలకి ఓ కమ్మని కల చెదిరింది. మే 25, 1991 దిన పత్రికని చూసి లేచాను.

# సినిమా హాళ్లలో హాస్యం

మన దేశంలో చవకయిన, పాపులర్ అయిన వినోదం సినిమా హాళ్ళలోనే దొరుకుతుంటుంది. సినిమాహాళ్లు ఒకప్పుడు డబ్బా రేకుల కప్పులతో, చెక్క బల్లలతో వుండేవి. కాని ఇప్పుడు అవి ఎయిర్ కండిషన్డ్ సౌకర్యంతో (అది నిజంగా వేసినపుడు సుమా) కుషన్ చెయిర్స్‌తో ఎంతో దర్జాగా ఉంటున్నాయి. కొందరు సినిమా ఏదో కూడా